చిన్న కథ

# పెళ్ళి చేశారు!

శ్రీ 'తుమ్మల'

ఒక్కొక్కరే స్నానాలు ముగిస్తున్నారు. రంగమ్మ సంతోషంగా మాట్లాడుతూ ఆప్యాయతగా అందరికీ అవీ ఇవీ అందిస్తూవుంది చీకటి మసక మసకగా వుంది. దీపంబుడ్డి వెలిగించుకొని నడిమింటిలోకి రంగమ్మ ప్రవేశించింది. వృద్ధాప్యం పైబడ్డా దానిని లెక్కచేయకుండా ధిక్కరించి తిరుగుతున్నట్లు కనబడుతుంది రంగమ్మ కనుబొమ్మలు చిట్లించి కళ్ళపై చెయిబెట్టి. "ఎవరబ్బాయి అక్కడ? తానానికి లేవవేం." అంటూ తేరిపారజూచింది.

"నే చేయనులే అమ్మమ్మా!" అని అక్కడ కూర్చున్న కుర్రాడు జవాబు చెప్పాడు.

"ఏంది నాయనా? ఎంతదూరం నుండి వస్తుర్రో. కాళ్లు పీక్కుపోయి వుంటవి. కాసిన వేన్నీళ్లు పోసుకుంటే ప్రాణం హాయిగుంటుంది. తిన్నచోట పండరు. పండినచోట తిర్రు. ఏం కట్టాలొచ్చినయిరా నాయనా." అని దళానికి సానుభూతిగా పల్కింది రంగమ్మ.

"నరసన్న దిగులుపడ్డట్టుందే" అంటూ దళంలో ఒకరు వ్యాఖ్యానం ప్రారంభించారు.

"కొత్తపిట్టగదూ, తాకిడికి తట్టుకోలేకపోయి వుంటుంది."

"ఎందుకు పనికొస్తరు ఈ అబ్బరాకాగంవోళ్లు."

"ఎంతలావుంటే సరిపోతది? అసలు సులుసూత్రం తెలియాలిగాని."

"తెలుస్తుందిగా రేపు సమరం చేసే దాడిలో"

మధ్య మధ్య నవ్వులు వేళాకోళాల్తో ఇలాగే సంభాషణ సాగుతోంది.

"నువ్వేరా బాబూ! ఎవరో అనుకున్నా. ఎంత మారిపోయినవ్. మావూరి నుండి దళంలో ఒక్కరైనా చేరారని అంతా సంతోషించుతున్రు."— అంటూ రంగమ్మ మధ్యలో అందుకొంది.

"అయితే నరసన్నకియాళ మొలలోతు పప్పన్నం"—రంగమ్మ అదోవిధంగా నవ్వింది

"ఏంటి అమ్మమ్మా అది" — అందరూ ఒక్కసారిగా ప్రశ్నించారు. జవాబు కెదురుచూస్తున్న దళానికి బాకాలూదిన శబ్దం వినిపించింది.

"ఎటెన్షన్" అంటూ దళాధిపతి ఆజ్ఞాపించాడు. గబగబా ఆయుధాలు చేతబట్టి నిలబడుతున్నారు దళసభ్యులు.

"అవి పెళ్ళిబాకాలు నాయనా! మీరు గాభరాపడనక్కర్లేదు. మీ రు ఊరిచుట్టు కాపలా పెట్టేరుగా" - రంగమ్మ దళానికి విశదపరచింది.

"ఆ రా సంగతి పెళ్ళెవరింట్లో" ఆయుధాలు క్రిందపారేసి నవ్వుతుంటూ రంగమ్మని ప్రశ్నించారు దళ సభ్యులు.

"ఎవరింట్లోనో కాదు. మన నరసన్న ఇంట్లో నే" అంటూ రంగమ్మ జవాబిచ్చింది.

"అయితే యింకేం, మనందరికీ పెళ్ళి భోజనాలు చేయించవోయి నరసన్నా. ముసలమ్మను బాధపెడతం దేనికి పెళ్ళికి వెళ్ళేసమయం చిక్కడినా ఏమిటిదిగులు!" దళాధిపతి వేళాకోళంగా నరసన్నను ప్రశ్నించాడు

రంగమ్మ మధ్య అడ్డువచ్చి మళ్ళా అందుకొంది

"నరసన్నా! మీ బాబు కబురు చేసింతురా? అయినా ఎక్కడున్నావని చేస్తడులే. అబ్బాయి నీకోసం గాని వత్తే నేచెప్పలేను కాని ఏం పెళ్ళోగా నాయనా! అబంలేదు. శుబం లేదు. అచ్చాటాలేదు. ముచ్చటాలేదు. నీ బాబు ఎంతనుకుంటే అంత. తన మతికి ఎంత దోస్తే అంత. ఒకరు చెప్పితే వింటడా. ముసలిదాన్ని మొగలనీయలేదు. మీ అమ్మ నోరు నొక్కిండు గదా! పిల్లది గడగడ వణికి పోతుండదిగదా."

"అందుకనేనమ్మా నాకు దిగులు. నేను వెళ్ళే ముందు బాబు ఈ విషయం తెస్తే, ఆయనతో పోట్లాడి మరీ వెళ్ళాను." — నరసన్న మౌనవ్రతంమాని రంగమ్మకి జవాబిచ్చాడు.

మళ్ళా బాకా లూదినశబ్దం వినబడింది. అందరూ డ్రెస్ వేసికొని బారులు తీర్చండని దళాధిపతి ఆజ్ఞాపించాడు.

"భోజనంచేసి వెళ్ళరు నాయనా"

"మళ్ళా వస్తాం"

లెఫ్ట్, రైట్! లెఫ్ట్, రైట్!

దళాధిపతి వెంట మార్చి చేసికొంటూ పోతున్నారు గెరిల్లాలు.

వాకిటదాకా వచ్చి వారివంక అదే పనిగా చూస్తోంది రంగమ్మ.

కామరెడ్డి గూడెంలో రంగమ్మ ఇల్లు ఊరిబయట వుంది. గెరిల్లాదళం ఎప్పుడు వచ్చినా అక్కడ మకాం వేస్తూవుంటుంది. నైజాం మిలిటరీ రాక్షస మూకలతో పోరాడుతూఉన్న ఒక్క కూతురు మరణించిన తర్వాత రంగమ్మకు మరో చింత లేదు. నైజాం రాక్షసుల్ని హతమార్చాలని తప్ప. దళం యింటికి వచ్చిందంటే వారిని ప్రాణప్రదంగా చూసుకుంటూ వేయి కళ్ళతో కాపాడుతూ వుంటుంది. చీమ చిటుక్కుమన్నా రంగమ్మకు మనస్సులో అదే యావ. తీరా భోజనమన్నా చేయకుండా బయలుదేరారే అని రంగమ్మ కొంత నొచ్చుకుంటూంది. దళాధిపతి బుచ్చన్న ఒకసారి చెప్పాడు. "అమ్మమ్మా! నీ వేది చెప్పినా వింటాం. కాని మమ్మల్ని ఎక్కడికి? ఎందుకు? అని ప్రశ్నించరా. మా పనికి అడ్డంచెప్పకు." అందుకనే హఠాత్తుగా బుచ్చన్న (దళాధిపతి) బయలుదేరిపోతే ఏమీ అనలేక పోయింది. బుచ్చన్నపోయిన దారివంకే చూపు ఆనినంతవరకు చూస్తూ నిలబడిపోయింది.

* * *

రఘువయ్యవంటి మొండిఘటం ఆవూళ్లో మరెవ్వరూ లేరు. ఎవరు చెప్పినా విని పించుకొనేరకం కాదది. తన మతికెంత తోస్తే అంతే. తండ్రికి తగ్గ కొడుకవుతాడని నరసన్నని అనుకొనేవాళ్ళు. కాని రఘువయ్య ధాటికాగలేకపోయాడు. ఒకనాడు చెప్పకుండా ఎటో లేచిపోయాడు. నరసన్న గెరిల్లాదళంలో చేరాడనీ, ఆదళం అప్పుడే రెండు మూడు విజయాలు సాధించినదనీ విన్న గ్రామప్రజలు, అతన్ని గురించి గర్వపడుతున్నారు. "నరసన్న వుంటే ఇలా అయ్యేది కాదేమో, యెంత మొండిఘటమైనా" అని అనుకొంటున్నారు "ఎవరి రాత ఎవరు తప్పిస్తారులే. దానిరాత అలావుంది" అని ఓదార్చుకున్నారుకొందరు. "కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగుతుందామరి? తలొక చెయ్యివేసి శుభ కార్యం నెరవేరుద్దాం" అనుకొన్నారు కొందరు.

పెండ్లి పందిరిలో చాలా సందడిగా వుంది. ఊడిపోతున్న గోచీ సర్దుకుంటూ కేకలు వేస్తూ రఘువయ్య ఇతరులకుపనులు పురమాయిస్తున్నాడు. ఊరు బయట బాకాలూదిన శబ్దమయింది. "కావిళ్లెత్తుకోండ్రా! ఏందిరా అట్టానిలబడతారు? పొద్దు పోవడంలే?" రఘువయ్య ఆజ్ఞాపిస్తున్నాడెవరికో. అప్పచ్చులు తింటూ కొట్లాడుకుంటూ కాళ్లకడ్డం బడిన పిల్లల్ని అవతలికి తోసివేస్తూ మాదిగ ముండల్లారా! చంపేస్తాను పొండవతలికి అంటూ కొట్టడానికి ఎత్తిన చెయ్యిని దాచేశాడు రఘువయ్య.

"ఏమండీ"

"ఇట్టా రండి"

లోపలినుంచి రఘువయ్య భార్య రెండుసార్లు కేకలు వేసింది

"దేనికి? ఎప్పటికీ తెమిలి యేడవదు. యేం వచ్చింది"-రఘువయ్య ఉరిమాడు.

"అమ్మాయి..." అని ఏదో చెప్పబోతుంది రఘువయ్య భార్య శాయమ్మ.

"అమ్మాయి?" గర్జించాడు రఘువయ్య

"అక్కడవుండే ఏమిటా కేకలు? మంచీ చెడ్డా లేదు. అవతలవాళ్లూ వీళ్లూ ఉన్నారన్న ఇంగితం లేకపోయె"

"ఏమిటా ఆడముండ సాధింపులు! అవతలొకపక్క వాళ్లొచ్చి కూర్చుంటేను. ఇంకా యింటిపనులే తెమలడం లేదాయె." అన్నాడు రఘువయ్య కొంత తగ్గి.

"అమ్మాయికి అక్కర్లేదంటు"

"ఏమిటి? పెండ్లా? తిత్తి వలుస్తాను. ఏదీ?"

రఘువయ్య ఒక్క దూకులో గదిలోకి వచ్చిపడ్డాడు, చుట్టూవున్న ముసలమ్మలు గడ్డంక్రింద చెయిపెట్టుకొని విస్తుపోతూ చూస్తున్నారు. తమపైకి ఏంవస్తుందో అని మెల్ల మెల్లగా పక్కకి తప్పుకొన్నారు.

"రఘువయ్య మంచి సబావం పోనీయడు" అంటూ నవ్వుతున్నాడు కావిడిసుట్టలు సర్దుతున్న కుర్రాడొకడు.

"కానీయండ్రా ఈ సోదికేంగాని అవతల పొద్దుపోతోంది" అన్నాడొక నెరిసిన తల కాయ.

ఈ రణగుణధ్వని మధ్య, గదిలోంచి సన్నని గొంతుకతో ఏడుపు వినపడుతూంది.

"ఎందుకండీ అంత తొందర? సాంతం వినకుండానే ఏమిటా అఘాయిత్యం? పెడ వంచి ఎలాగో పెళ్లికి రప్పించారుగా! అది కాదు. దానికా చీర వద్దంటుంది." అన్నది శాయమ్మ కూతురికీ భర్తకూ మధ్య నిలబడి.

"అసలు నీదగ్గర వుంది. ఈ మాత్రం దానికి నన్ను పిలవాలా ఏమేంటి? దానికి చీర కట్టించడానికి ఇంత రాద్ధాంతమా! అవతల పొద్దుపోతూంది పానకాల కాడికి పోతున్నా. సముదాయించి ఏదో అఘోరించు." అంటూ రఘయ్య బయట కడుగు పెడుతున్నాడు.

"శాయమ్మా! ఏందే, ఒకటి అగుపిస్తే ఇంకోటి అగుపించదు. తిరుగమోతనూనె ఎక్కడ పెట్టిందే?" అంటూ రాగాలుతీస్తూ రఘయ్య తల్లి ప్రవేశించింది. కోడలిపైన ధామ్‌ధూమ్‌లు చేయడం విన్నది.

"ఏమిట్రా, ఎంత సేపూ గదిలో కూర్చుని కేకలెడతారు, అంతా నా కోసం ఎదురుచూస్తూంటే? ఏమిటాపిల్లదానిమీద కేకలు. తెచ్చావు మాలావు సమ్మంధం. ఈపూటన్నా దాన్ని వదలి పెట్టకూడదూ? చిన్నది తెలిసో తెలియకో ఏదన్నా అంటే సమదాయించాలిగాని అట్టా వంటికాలి మీదలేస్తే ఎట్టా?" అంటూ కొడుకును మందలించింది రఘయ్యతల్లి. "ఈమాత్రం దానికి మొగుడుతో మొర్ర పెట్టుకోవాలేం?" అంటూ కోడలివంక చుర చురా చూస్తూంది.

పెళ్లికూతురు శాంతమ్మ గడగడ వణుకుతూ ఒక మూలన బడింది. దెబ్బ తిన్న లేడిలా అమ్మవంకా బాబువంకా నాయనమ్మవంకా చూస్తోంది.

"రఘయ్యా మావా ఇంట్లోనే పాతుకు పొయ్యావేమిటే"

"మాపిల్లకి ఆకలేస్తుందని అరిసెలు బొక్కుతున్నానులేరా"

హిహిహీ - గొల్లున నవ్వుతున్నారు పెళ్ళి పందిట్లో

"ఏదో మారే యేసవండి ఈబాగ్గానికి పడి చెడగొట్టి నన్ను పిలవాలేం! యీ మాత్రం నిర్వాకం చేయలేని బతుకెందుకూ?" అంటూ పళ్ళు నూరాడు భార్యమీద రఘయ్య, కూతురువంక జూసి, "శాంతా! కిక్కురు మన్నావంటే తెలుసా? నాకు కోపం వచ్చిందా మరి పిసికాను." అంటూ బెదరించాడు. పందిట్లో కేకలకి జవాబుగా.

"దబ్బున తెమల్చండి. వస్తున్నానుండండ్రా, ఏమిటా యేళాకూళాలురా?" బయటికి అడుగు పెట్టాడు రఘయ్య. మళ్లీ వెనక్కి తిరిగి,

"అదిగో! ఆచీరే కట్టండి దొరగారు మరీదగ్గరుండి కొనిపించాడంట. అమ్మాయి కది కట్టకపోతే వాళ్ల ముచ్చటెట్టా తీరుద్ది? కోపం వస్తది. పైగా పెద్ద వాళ్లతో సంబంధం" అంటూ పెళ్లి పందిరిలోకి వచ్చి పడ్డాడు రఘయ్య.

రఘయ్య తల్లి సాధింపులుసాగించింది

"ముచ్చటంట! ఆ అచ్చటా ముచ్చటా వుంటే ఇలాగెందుకు ఏడుస్తుంది? ఇంట్లో అబ్బాయైనా లేకుండ మావాళ్లన్ని నొక్కి చేస్తుండేది చాలదు? చీరల దగ్గర్నించీ మీయిష్టమేనా? దానికిష్టంవచ్చింది కట్టుకోనరాదు?"

"ఏమిటమ్మా ఈ సాధింపులు? నేనే మనునా నీ కొడుకును బలవంతం చేశానా? అప్పుడేమైంది ఈ నోళ్లు? ఎదటుండటానికి ఒకరికీ నోరు రాదు. చాటున బడి ఏడుస్తారు! ఇంతకూ నారాత మంచిదైతే..." రఘుయ్య భార్య కన్నీళ్లు తుడుచుకుంటూంది.

"అమ్మ నా కొడ్డే" మూల మూలకు ఒదుగుతూ పోతూంది శాంతమ్మ. రఘుయ్య తల్లి, కోడలు వంకా, మనవరాలి వంకా, కావడి పెట్టెపై చీకంగా చూస్తూ నిలబడి పోయింది. రఘుయ్య భార్య కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ అలాగే కూర్చొబడింది. ఓ మూల దీపారాధన ప్రమిద మినుకు మినుకు మంటూ జాలిగా చూస్తూంది. దూరంగా తాసామరపాలధ్వని, బాకాలూది చప్పుడు, ఇంటిముందు పిల్లల పెద్దల కోలాహలం. కాని గదిలో భరింపరాని నిశ్శబ్దం

దొర ( దేశముఖ్ ) గారి సలహాతో పెళ్ళి కొడుకు ప్రధానంకంటూ పంపిన ఎర్రపట్టు చీర పెద్ద దెయ్యం నోరులా తెరచుకొని శాంతమ్మ వంక చూస్తోంది. శాంతమ్మ చెక్కిళ్ళ వెంట జలజలా కన్నీళ్లు రాలుతున్నాయి. వణుకుతున్న పెదవుల మధ్యనుంచి "వద్దు! వద్దు!!" అన్న శబ్దం బయటకు వెగిలి రాలేక రాలేక వస్తోంది.

* * *

ఊరిబయట పెళ్ళివారు దిగారు. పానకాల కావిళ్ళు దిగాయి. కాళ్ళూ చేతులూ కడుక్కొని బంధువులంతా పానకం స్వీకరిస్తున్నారు.

పెళ్ళికొడుకు సోమయ్యకి దేశముఖ్ కూ ఏదో సంబంధం వుందట. దేశముఖ్ అక్కడినుండి పారిపోయి పట్టణంలో మకాంబెట్టి ఆంధ్ర మహాసభ వారితో రాజీలకు కబురు పెడుతున్నాడు. ఆ గ్రామస్తుల మెప్పు పొందుదామనో ఏమో, పెళ్ళికొడుకుకు తమ తాలూకు కచ్చడంబండీ, యితర సామాగ్రీ వగైరా పంపి, పెళ్ళికొడుకు వారి దర్జా కొంత పెంచించారు. పెళ్ళికొచ్చిన పెద్దలలో కుర్రకారు తక్కువ. ఎక్కువ మంది ముసలాళ్ళే.

"దళం వారు వచ్చారు. కూర్చొబెట్టండి"

"ఏయ్! పిల్లలూ మీరట్టా సద్దుకోండిరా!"

"మనూళ్లో మీటింగ్ ఉందేమండి? రెండూ కలిసొచ్చినాయి. పెళ్ళయాక మీటింగు పెట్టుకుందాం. అందరికీ తీరుబడిగా వుంటుంది."

"పానకం ఇయ్యండిరా వారికి"

"మాకు సత్కారాలకేం వచ్చిందిగాని పెళ్ళికొడుకు ఏడండి?

"అడుగో! మీ ప్రక్కనే."

"వీరేనా అండి!"

"అవును. ఇప్పటి పెళ్ళిళ్లలాగ అట్టే కట్టహాసం చేయలేదు లెండి. ఇదివరలో చేస్తే సరిగా ఫలించలేదని ఇపుడా ఆనవాయితీలన్నీ మార్చివేశాం లెండి."

"అంటే ఇది..."

"ఎబ్బే! మూండో పెండ్లి లెండి!"

"మూండో పెళ్ళని షేరేగాని, ఎంతో

వయస్సు లేదండి. మన నరసన్న పుట్టకలికి ఆయన మొదటి..."

"అపయ్యా! ఎవ్వడడిగాడీ సోదంతా నిన్ను" అని గద్దరించాడు రఘుయ్య. దళాధిపతి బుచ్చన్న ప్రశ్నలకు జవాబు చెబుతున్న ముసలాడు మెదలకండా కూర్చున్నాడు. బుచ్చన్న సంచిలోంచి నల్లని వస్తువు పెళ్ళికొడుకు ముఖానికి సమీపంగా అనిచ్చాడు

పెళ్ళికొడుకు అదిరిపడ్డాడు. తలగుడ్డ వెనక్కి పడింది. "అదేంపని! అదేం పని బాబూ పిస్టలా?"

"మీరు కదలకండి" వలంటీర్లు ఆజ్ఞాపించారు. పెళ్ళికొడుకుచుట్టూ చేరారు.

"పిస్టల్ కాదులేవయ్యా. బాటరీలైట్ అంటూ స్విచ్ వేశాడు బుచ్చన్న.

"బలేపని చేశావే, మా గుండెలన్నీ ఆగిపోయాయి. హీహీహీ" – అంటూ భయంతో గూడిన నవ్వు నవ్వాడు ముసలాడు.

"ఏమండీ పెళ్ళికొడుకుగారూ ఎన్నో పెండ్లండి యిది?

"మూడు"

"ఇదివరకెంతమంది పిల్లలు?"

"నల్గురు"

"ఇద్దరు కాపరానికెళ్ళారు అబ్బాయి వయసుకొచ్చాడు పోతే ఒక పోరడు మాత్రం వున్నాడు. వాణ్ణి సాకడం తప్పితే పిల్లకాట్టే కట్టం లేదులెండి."– పెళ్ళికొడుకు ప్రక్కన ముసలాడు కాస్త ధైర్యం తెచ్చుకొని జవాబులిస్తున్నాడు.

"ఏమండీ? ఏమిటి తమ వేళాకోళాలు. లగ్గంవేళ మించిపోతుంది."

"వేళాకోళం లేదు. ఎగసెగాలూ లేవు, మీరు మాట్లాడకండి"

"తర్వాత బుచ్చన్న గారంతా తెలియజెప్పతారు. మీరూరుకోండి అడావిడి పడకండి."

దళం వలంటీర్లు అందరినీ సర్దారు. అంతా నిశ్శబ్దం–

"పెళ్లికొడుగ్గారూ! తలఅలా నున్నగా గొరిగించారేమండి? పెళ్లికదా!"

"పెళ్లాం బోయిందిగా. మగడుపోయిన బాపనమ్మలా గీయించుకున్నాడు లెండి." ఎవడో పిల్లకాయ అనేశాడు.

హిహిహీ-ఘల్లున నవ్వాసుకొంటిరు.

"ఎవర్రా అదీ! చిన్నా పెద్దా లేకుండా?"

"అది కాదులేండి"! పెళ్లికొడుకు తరఫు ముసలాయన చేతులు నలుపుకుంటూ దళాధిపతి దగ్గరకు వచ్చాడు.

"ఏం కాదు."

"తల నెరిసింది. కాస్త గుండు చేయించుకుని తలగుడ్డ చుడితే బాగుంటుందని అలాచేశాడులెండి. ఏదోమరి కాస్త ఈ కాలపు మనిషిలా కన్పించాలిగా!"

"సోక్ గాడే – మా చిన్నినాయనే" పిల్లలు ఒకమూలనుంచి పాట పాడుతున్నారు.

రఘుయ్య ఓర్పుకు ఇక హద్దు దాటిపోయింది.

"ఏంరా! గాడిదకొడకా, నేడుగా ఏడవలేకపీరిని వెంటబెట్టుకొచ్చావా?" అని

కొడుకు నరసన్న పైకి దూకాడు. ఊళ్లో వాళ్ళు రఘయ్యని కాస్త వెనక్కి లాగారు.

"ఇంతకూ ఏమంటారండీ, ఈ పెళ్ళి సాగనిస్తారా లేదా? మీ యవ్వారమేంటో మీరు చూసుకోవాలిగాని ఇలాంటివాటిల్లో జోక్యం కల్పించుకోడం బావుండదు" అంటూ దళనాయకుని వంక చూసి అన్నాడు రఘయ్య

బుజాన రైఫిల్‌తో రఘయ్య కడ్డంగా నిలబడ్డాడు నరసన్న.

"చంపరా! వెధవ! చంపు. ఏమాత్రం చంపుతావో చూస్తాను" అంటూ ఉద్రేకాన్ని, అవమానాన్ని పట్టలేక రఘయ్య లేచాడు

"ఏమిటా తొందర. ఆళ్లు చెప్పేదేంటో వినవే కాస్త" అంటూ ప్రక్కవాళ్లు మళ్ళీ కూర్చోబెట్టారు.

"ఏమయ్యా నీ వయస్సెంత?"

"నలభై" అన్నాడు పెళ్ళికొడుకు.

"నిజం చెప్పు" దళాధిపతి గద్దించాడు.

"ఇంకా కొంచెం వుంటవండి"

"సరిగ్గా చెప్పమంటే"

"55 ండీ"

"పిల్లకు?

"తెలవదండి"

"తెలియదూ?"

"పదమూడు"

"పిల్ల పెళ్లికి వొప్పుకుందా?"

"నాకేం తెలుసండి!"

"మరేం తెలుసని ముస్తాబై వచ్చావు?"

"ఏదో చిన్నతనంచేత మారాము చేస్తుంది కాని, తర్వాత అదే దారికి వస్తది లెండి. అయినా పెళ్లికూతురు ఒప్పుకోటం ఏమిటండి. ఎబ్బే! అలాంటి పిచ్చికళలు మనలో ఎక్కడా లేవండి."

పెళ్లికొడుకు తరఫు ముసలాడు ఇంకా ఏమిటో చెప్పబోతున్నాడు. "ఇక కట్టిపెట్టు ఆ రఘయ్య మెడలో కట్టమను తాళిని"

రఘయ్య తల వంచుకు కూర్చున్నాడు. అసమర్థుణ్నయ్యాననుకొన్నాడు. కళ్లనీళ్లు తిరిగాయి. పెళ్లికొడుకు గుడ్లు మిటకరిస్తున్నాడు.

"అయినా ఈ కాలాన్ని బట్టి ఇలాంటివి చేయడం అంత మంచిది కాదులే"

"ఇంటిల్లిపాదీ నెత్తీనోరూ కొట్టుకుంటున్నా ఇలాంటి సమ్మంధం తేవడం అదీ అంత మంచిదా ఏంటి?"

"అయినా దళంవాళ్లకి ఇందులో సంబంధం ఏంటండి? వాళ్లపని వాళ్లు చూసుకోక"

"ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు. పెళ్లివారు లేచిపోండి" అని ఆజ్ఞాపించాడు నరసన్న. అందరి దృష్టి నరసన్న వంకా, బుచ్చన్న వంకా వుంది.

"మమ్మాయికి బొత్తిగా యిష్టంలేదు. మావాళ్ళంతా మా బాబు బలవంతాన ఒప్పుకున్నారు. ఏమైనా సరే ఈ పెళ్ళి చేయనీయను." అంటూ నరసన్న ఒక ఉపన్యాసం యిచ్చేవాడి ధోరణిలో మాట్లాడాడు.

"ఏమండీ మన్మల్నిట్లా అగౌరవపరచి పంపడం న్యాయమేనా?" అంటూ పెళ్ళికొడుకు తరఫున ఒకళ్ళిద్దరు కొమ్మేసుకు వచ్చారు.

"పీటల మీద పెళ్ళి చెడగొట్టడం న్యాయమేనా?" అని ప్రశ్నించారు.

"మీకింకా సత్కారం చేయకుండా మంత్రమున్నందుకు సంతోషించండి. పీటల మీద పెళ్ళి కాదు చెడగొట్టింది. పీకమీద కత్తి తొలగిస్తున్నాము"

"లేవలేం, ఇంకా చూస్తారేం." అన్నారు నరసన్న.

"భోంచేసి పోతారుగావాలు" ఎగతాళిగా ఒక కుర్రాడన్నాడు.

"ఇక భోజనాలు కూడా. ఈ మర్యాద చాలు కట్టండిరా బళ్ళు" అన్నాడు ముసలాడు.

పెళ్ళికొడుకు ఊడిపోయిన గోచీ సర్దుకుంటూ బండికింక గబగబా అడుగులు వేసుకొంటూ బయలుదేరాడు.

"బుచ్చన్నగారి ఉపన్యాసం వుంటుంది వింటే వినవచ్చు." వెళ్లిపోయే పెళ్ళికొడుకు మూతావంక జూచి ఒక కుర్రాడన్నాడు.

"ఈ ఉపన్యాసం చాలులే నాయనా"

"ఏంటిరయ్యో గింజుకుంటున్నవ్"

"మాట్లాడకబాకయ్యాపద. పెళ్ళికొడుకు తొందర పెట్టాడు ముసల్నాణ్ణి.

ఒకఫర్లాంగుదూరం నడిచాయి పెళ్ళిబళ్లు. నవ్వులూ - చప్పట్లూ వినబడుతున్నాయి మీటింగులో. ఒక పెళ్ళిపెద్ద నిట్టూర్పు విడస్తూ వ్యాఖ్యానిస్తున్నాడు.

"మా నోరుగల ముండాకొడుకురా బుచ్చన్న. చూశావ్ ఎంతలో వాళ్ళ మనసు తిప్పేశాడో. దశం చేసిన పనికి సంతోషంగా చప్పట్లుకూడ కొట్టిస్తుండు. ఇలాంటి పెళ్ళిళ్ళు వద్దని ఉపన్యాసము ఇస్తా వుంటడు"

"ఎవడ్రా ఆ పసుగెత్తుకొచ్చేది?"

"ఎవడో బుడ్డాడు. ఏంటో పట్టుకొని పసుగెత్తు కొస్తున్నడు"

"కొంచెం ఆపు"

"ఆపేదేంటి. పోనీయండహే. ఏదో మళ్లా పశ్నాసం వుంది." తొందరపెడుతున్నాడు పెళ్లికొడుకు.

మళ్ళా చప్పట్లు, హర్షధ్వానాలు వినబడుతున్నాయి మీటింగులో.

కుర్రాడు రొప్పుకుంటూ రొజుకుంటూ బళ్ల సమీపానికి చేరాడు

"ఇదిగో మీ చీరె. మీ ప్రధానం చీరె. మా అక్కయ్య మీ మొగాన పారవేసిరమ్మంది."

"ఎంతపొగరు పోరడికి"

"పోనీయంర్రా బండి. చీరకు నీకు ఒక సలాం. పోనీయండి బండి" పెళ్ళికొడుకు నోటిమాట ఇంకా తడబడుతూంది.

"ఇదిగో చీరె, చీరె"" అంటూ కుర్రాడు కొంతదాకా వెంబడిస్తూనే వున్నాడు. పెళ్ళిబళ్ళు ఇంకా వడిగా ఉడాయిస్తూనే వున్నాయి. కుర్రాడు బళ్ళను అందుకోలేక పోయాడు

"పెళ్లంట ఈడిమొగానికి! ఈడిమొఖం మండ! తూ" అంటూ చీర అవతలపారేసి గభాలున వెనక్కి తిరిగాడు. ఒక కర్ర ఎడం భుజంమీద వేసుకొని "లెఫ్ట్ రైట్ "లెఫ్ట్ రైట్!" అనుకొంటూ రొమ్ము విరుచుకొంటూ పోతున్నాడు. అక్కడక్కడా ఆగి శాల్యూట్ చేస్తున్నాడు. మళ్ళా ఎవరన్నా చూస్తున్నారేమోనని వెనక్కి చూసుకుంటూ పోతున్నాడు.

ముచ్చెమటలకు తడిసిన బోడిగుండును సవరించుకొంటూ 'హమ్మయ్య' అని నిట్టూర్పు విడిచాడు దూరానబండిలో పెళ్లికొడుకు.